క్లుప్తంగా

వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

• జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లక్ష్మి

డెంకాడ: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి అన్నారు. మండలంలోని డెంకాడ శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను ఆమె మంగళవారం పరిశీలించారు. విద్యార్థులు ప్రతిరోజూ గ్రంథాలయానికి వచ్చి ఎలాంటి విషయాలు నేర్చుకుంటున్నారన్నదీ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి దశ నుంచే ముఖ్య నాయకుల జీవితచరిత్ర పుస్తకాలను చదవాలని సూచించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ వై.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన కల్పించండి

• డీఎంహెచ్ఓ జీవనరాణి

డెంకాడ: వేసవి ఎండల నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి ఎస్.జీవనరాణి అన్నారున. మండలంలోని మోపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించడంతో పాటు ఆశ వర్కర్ల అజెండా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ల్యాబ్ రూమ్‌ను పరిశీలించారు. ఆస్పత్రి పరిసరాలను పరిశీలించి డాక్టర్ కె.శరణ్యకు పలు సూచనలు చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యవంతంగా కిశోర బాలికలు

• ఐసీడీఎస్ ఏసీడీపీఓ తవిటినాయుడు

విజయనగరం ఫోర్ట్: కిశోర బాలికలు ఆరోగ్యవంతంగా ఉండాలని ఐసీడీఎస్ ఏసీడీపీఓ బి. తవిటినాయుడు అన్నారు. స్థానిక సీపీ గుడి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో కిశోర బాలికలకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. మే 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు కిశోర వికాసం పేరిట అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టీనేజ్ వయసులో గర్భం దాల్చితే అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ పోక్సో చట్టం గురించి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనురాధ, తదితరుల పాల్గొన్నారు.

నెలాఖరులోగా ట్రేడ్ లైసెన్స్‌లు

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలో నిర్వహిస్తున్న వ్యాపార సంస్థలన్నిటికీ ఈ నెలాఖరులోగా ట్రేడ్ లైసెన్సులు విధించాలని కమిషనర్ పల్లి నల్లనయ్య కార్యదర్శులకు ఆదేశించారు. మంగళవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సచివాలయ శానిటరీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాపార సంస్థలన్నీ విధిగా డీఅండ్ఓ ట్రేడ్ లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. రెస్టారెంట్లు, నర్సింగ్ హోమ్‌లు, వస్త్ర దుకాణాలు, ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలలు, సినిమా థియేటర్లు, కల్యాణ మంటపాలు వంటి అన్ని వ్యాపార సంస్థలకు ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరిగా ఉండాలన్నారు. అలాగే నగరంలోని ప్రతి కాలువను శుభ్రపరచాలని సూచించారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, సీనియర్ అసిస్టెంట్ రమేష్ రాజు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న తప్పెటగుళ్ల ప్రదర్శన



కళాకారుల ప్రదర్శన

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి ఆలయ ఆవరణలోని ఆధ్యాత్మిక కళావేదికపై మంగళవారం రాత్రి నిర్వహించిన తప్పెటగుళ్ల ప్రదర్శన ఆకట్టుకుంది. రామభద్రపురం మండలం పాతరేగ గ్రామానికి చెందిన కళాకారుల అద్భుత ప్రదర్శనకు భక్తులు కరతాళధ్వనులతో అభినందించారు. అనంతరం కళాకారులను ఈఓ ప్రసాద్ సత్కరించారు.

పరిశీలన..

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్‌ల స్టాక్ పాయింట్‌ను సమగ్ర శిక్ష జిల్లా సెక్టోరియల్ టీమ్ ప్రతినిధులు మంగళవారం పరిశీలించారు. సీఎంఓ ఆదినారాయణ, సహాయ సీఎంఓ రామారావు పరిశీలించి, పుస్తక వివరాలను అడిగి తెలుసుకున్నారు. రూమ్ ప్లాన్ ప్రకారం స్టూడెంట్ కిట్లను ఐటమ్స్ వారీగా ఏర్పాట్లు బాగా చేశారని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ – 2 శ్రీరాము, ఎంఆర్‌సీ సిబ్బంది, సీఆర్ఎంటీలు, ఐఈఆర్‌పీలు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

వార్డు సందర్శనతో సమస్యల పరిష్కారం

నెల్లిమర్ల: పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికే వార్డు సందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కమిషనర్ ఎ. తారక్‌నాథ్ తెలిపారు. వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా స్థానిక 7, 8, 9 వార్డుల్లో మంగళవారం పర్యటించారు. అన్ని వీధుల్లో తిరిగి తాగునీటి సరఫరా, వీధిలైట్లు, పారిశుధ్య సమస్యలపై ఆరా తీశారు. సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.

అంతా కల్తీయే..

• నాసిరకం ఫుడ్ తిని అనారోగ్యం బారిన పడుతున్న ప్రజలు
• ఆహార పదార్థాల తయారీలో హోటళ్లు, రెస్టారెంట్ల తీరు అధ్వానం
• కానిరాని అధికారుల తనిఖీలు



ఇటువంటి నూనెలో వండిన పదార్థాలు అనారోగ్యకరం

విజయనగరం: నగరానికి చెందిన నాయుడు అనే వినియోగదారుడు ఇటీవల రింగ్‌రోడ్‌లో గల ఓ రెస్టారెంట్‌లో చికన్ ఐటెమ్స్ ఆర్డర్ చేయగా... ఈ మేరకు నిర్వాహకులు ఆహారాన్ని ప్యాక్ చేసి ఇచ్చారు. అనంతరం సదరు వినియోగదారుడు ఇంటికి వెళ్లి తెరిచి చూడగా నిల్వ మాంసాన్ని నూనెలో వేయించి ప్యాక్ చేసినట్లు గుర్తించారు. వెంటనే రెస్టారెంట్ వద్దకు వెళ్లి ప్రశ్నిస్తే అలానే ఉంటుంది... నచ్చితే తినండి, లేదంటే వదిలేయండి అంటూ సమాధానమివ్వడం కొసమెరుపు. దీంతో వినియోగదారుడు ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించగా... వారి నుంచి స్పందన లేకపోవడం గమనార్హం. రెండు రోజుల తర్వాత వెళ్లి తనిఖీలు చేస్తామంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారంటూ బాధిత వినియోగదారుడు వాపోతున్నాడు. అభివృద్ధి చెందుతున్న విజయనగరంలో నిత్యం ఇలాంటి కల్తీ ఆహార విక్రయాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలా అయితే ప్రజారోగ్య పరిరక్షణకు బాధ్యులెవరని ప్రశ్నిస్తున్నారు. గతంలో కూడా నగరానికి చెందిన హరీష్ రింగ్‌రోడ్ ప్రాంతంలో ఓ రెస్టారెంట్‌లో ఉలవచారు బిర్యానీ కావాలంటూ ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేశాడు. ఇంటికి వచ్చిన ఆర్డర్‌ను తెరిచి చూడగా.. పార్సిల్‌లో పురుగులు కనబడడంతో అవాక్కయ్యాడు. ఇటువంటి సంఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి.

ఆలోచించాల్సిందే..

హోటల్‌లో, రెస్టారెంట్‌లో భోజనం చేస్తున్నారా.. లేని పక్షంలో ఆన్‌లైన్ ఆర్డర్ పెట్టి ఇంటికే తెప్పించుకుంటున్నారా..? ఇక నుంచి కాస్త ఆలోచించి నిర్ణయం తీసుకోండి. అపరిశుభ్రంగా వంటశాలలు, కుళ్లిపోయిన మాంసం, పాడైన కూరగాయలు, వస్తువులను నిర్వాహకులు వినియోగిస్తున్నారు. ఇటీవల ఆహార కల్తీ నియంత్రణ విభాగం అధికారులు నిర్వహించిన దాడుల్లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. చాలా హోటళ్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని స్వయానా అధికారులే వెల్లడించడం గమనార్హం. రెగ్యులర్‌గా సంబంధిత శాఖ అధికారుల తనిఖీలు లేకపోవడం.. రంగులు, హంగులతో పైకి బాగా కనిపించేలా వంటకాలు సిద్ధం చేస్తుండడంతో వినియోగదారులు నాణ్యత విషయాన్ని పట్టించుకోవడం లేదు. నాణ్యత లేని ఆహారం తిని అస్వస్థతకు గురికావడం, హోటళ్లపై ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే అధికారులు దాడి చేస్తుండడం విమర్శలకు తావిస్తోంది.



వండేందుకు ఉంచిన నిల్వ సామాగ్రి

ప్రజారోగ్యంతో చెలగాటం...

మారుతున్న ప్రజల ఆహారపు అలవాట్లను ఆసరాగా చేసుకుని హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో ఎక్కువగా ఆహార కల్తీ సాగుతోంది. అయినప్పటికీ ఉన్నతాధికారులు కన్నెత్తి చూడడం లేదు. అప్పుడప్పుడూ తూతూమంత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకొంటున్నారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నట్లు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో జరిగే మోసాలు, లోపాలపై దృష్టి సారిస్తేనే ప్రజలకు మేలు జరుగుతుంది. జిల్లాలో ఆహార తనిఖీ విభాగంలో సిబ్బంది కొరత, ఇతర శాఖల అధికారుల్లో నిర్లక్ష్యం, ప్రజల్లో అవగాహన లోపం, ధనార్జనే ధ్యేయంగా చెలరేగుతున్న అక్రమ వ్యాపారుల ధోరణి వెరసి ప్రజారోగ్యం కల్తీకి గురవుతోంది. కాగ్ నిబంధనల ప్రకారం పట్టణ, నగర ప్రాంతాల్లో ప్రతి 50 వేల మందికి, గ్రామీణ ప్రాంతాల్లో అయితే ప్రతి లక్ష మందికి ఒక ఆహార తనిఖీ అధికారి ఉండాలి. ప్రస్తుతం ఆ స్థాయిలో అధికారులు, సిబ్బంది లేరు. చికెన్ పకోడీ, బజ్జీ దుకాణాలు, టిఫిన్ సెంటర్లలో రోజూ కాగిన నూనెనే వాడడంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోంది. వాస్తవానికి మనం వినియోగించే వంట నూనెలో టోటల్ పోలార్ కాంపౌండ్స్ మోతాదు 25 లోపు ఉండాల్సి ఉండగా... అంతకంటే ఎక్కువ శాతం మోతాదు కలిగిన నూనెను వినియోగిస్తున్నారు. ఇటువంటి కలుషిత నూనెలతో తయారు చేసిన ఆహారాన్ని తింటే గ్యాస్ట్రిక్, క్యాన్సర్ వంటి రోగాలు వచ్చే అవకాశాలు ఉన్నయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

తరచూ తనిఖీ చేస్తున్నాం..

మాకు కేటాయించిన ప్రాంతాల్లో తరచూ తనిఖీలు చేస్తున్నాం. ప్రతి నెలా 12 సార్లు తనిఖీలు చేయాల్సి ఉంటుంది. అలా తనిఖీలు చేసి లోపాలుంటే కేసులు నమోదు చేస్తున్నాం. మున్సిపాలిటీల్లోనూ శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు తనిఖీ చేసే అధికారం ఉంది. అన్ని ప్రాంతాల్లోనూ తనిఖీలు చేయిస్తాం.

– నాగుల్‌మీరా, ఫుడ్ సెఫ్టీ ఇన్‌స్పెక్టర్, విజయనగరం.

కుట్టుమిషన్ల స్కామ్‌పై విచారణ చేపట్టాలి

• వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు మహంతి జనార్దనరావు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు మహంతి జనార్దనరావు, తదితరులు

పూసపాటిరేగ: నిరుపేద మహిళలకు మంజూరు చేయాల్సిన కుట్టుమిషన్లు ఎవరు స్వాహా చేశారో విచారణ చేపట్టి నిగ్గు తేల్చాలని వైఎస్సార్‌సీపీ విజయనగరం బీసీ జిల్లా అధ్యక్షుడు మహంతి జనార్దనరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిరుపేద మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు ఇస్తామంటూ మోసం చేశారని ఆరోపించారు. రూ. వంద కోట్లతో ప్రతిపాదనలు చేసి.. అనంతర కాలంలో మొత్తాన్ని రూ. 257 కోట్లకు పెంచిన ప్రభుత్వం ఎన్ని లక్షల మందికి కుట్టుమిషన్లు పంపిణీ చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు నెలల కిందట మండల పరిషత్ ఆధ్వర్యంలో గ్రామాలలో కుట్టు మిషన్లు సెంటర్లకు భవనాలను పరిశీలించి, ఆ తర్వాత ఆ ప్రక్రియనే పక్కన బెట్టేశారని ఆరోపించారు. పచ్చచొక్కా నాయకులకు లబ్ధి చేకూర్చడానికే ఈ స్కీమ్ తీసుకువచ్చారన్నారు. సమావేశంలో పూసపాటిరేగ, సీహెచ్ అగ్రహారం సర్పంచ్‌లు టొంపల సీతారాం, కొత్తకోట శ్రీరాములు, ప్రజాప్రతినిధులు మహంతి లక్ష్మణరావు, రౌతు సత్తిబాబు, కోరాడ అరుణకుమార్, బందపు రామారావు, మలుకుర్తి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మందులపై జీఎస్‌టీ రద్దు చేయాలి

విజయనగరం ఫోర్ట్: మందులు, మందుల పరికరాలపై జీరో శాతం జీఎస్‌టీ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏపీ మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (ఏపీఎంఎస్ఆర్‌యూ) రాష్ట్ర సంయుక్త కార్యదర్శి యూఎస్ రవికుమార్ కోరారు. ఈ మేరకు జాయింట్ కమిషనర్ స్టేట్ టాక్స్ వారికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. మందులపై 18 శాతం వరకు జీఎస్‌టీ ఉందన్నారు. దీంతో సామాన్యులు మధ్య తరగతివారు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మందులపై జీఎస్టీ రద్దు చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యూనియన్ నాయకులు సూర్య భగవాన్, సుధీర్, కోశాధికారి, నరేష్ ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నెల్లిమర్ల: యువత, విద్యార్థులు గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని భోగాపురం రూరల్ సీఐ జి. రామకృష్ణ, మిమ్స్ డీన్ డాక్టర్ సీహెచ్ లక్ష్మీకుమార్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సి. రఘురాం సూచించారు. మిమ్స్ ఆధ్వర్యంలో నెల్లిమర్ల పట్టణంలో యాంటీ డ్రగ్స్ ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు జీవితాలను నాశనం చేస్తాయని హెచ్చరించారు. మిమ్స్ కళాశాల నుంచి రామతీర్థం జంక్షన్ వరకు కొనసాగిన ర్యాలీలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు నినాదాలు చేశారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీకి ఏర్పాట్లు



స్టూడెంట్ కిట్ల పంపిణీపై ఎంఈఓలు, సిబ్బందితో చర్చిస్తున్న సీఎంఓ ఆదినారాయణ

భోగాపురం: సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్ల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని తనిఖీ అధికారి ఆదినారాయణ ఆదేశించారు. భోగాపురం ఆదర్శ పాఠశాలలో ఉన్న స్టాక్ పాయింట్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాలల పునః ప్రారంభం నాటికే విద్యార్థులకు కిట్లను అందజేయాల్సి ఉందని, సంబంధిత సీఆర్‌పీలు ప్రణాళికాబద్ధంగా నడుచుకోవాలన్నారు. ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి విద్యార్థుల వివరాలను ఎప్పటికప్పుడు సేకరించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సీఎంఓ రామారావు, ఎంఈఓలు రమణమూర్తి, చంద్రమౌళి, సీఆర్పీలు మాతా శేషుబాబు, సూర్యనారాయణ, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయం చేపట్టాలి



తంగుడుబిల్లి రైతులకు ఎరువుల కిట్లను అందజేస్తున్న అధికారులు

నెల్లిమర్ల రూరల్: సేంద్రియ వ్యవసాయ సాగును రైతులు అలవర్చుకోవాలని ప్రకృతి వ్యవసాయ విభాగం ఆర్టీఓ ప్రకాష్ సూచించారు. మండలంలోని తంగుడుబిల్లిలో రైతులతో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవధాన్యాలు, పచ్చిరొట్ట ఎరువుల సాగుతో నేల సారవంతమవుతుందని, సూక్ష్మజీవులు వృద్ధి చెంది పోషకాలు పెరుగుతాయన్నారు. పూత దశలో కలుపు నివారణకు నేలను కలియ దున్నాలని సూచించారు. రసాయన ఎరువులను మోతాదుకు మించి వినియోగిస్తే భూసారం తగ్గుతుందని చెప్పారు. అనంతరం నవధాన్యాలు, పచ్చిరొట్ట ఎరువుల కిట్లను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఏఓ పూర్ణిమ, డీఆర్‌సీ వ్యవసాయ అధికారి సంగీత, సిబ్బంది పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో వృద్ధి...



ఆడిట్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: విజయనగరం కార్పొరేషన్ నిధుల నిర్వహణ, ఆదాయ, వ్యయాలు మెరుగుగా ఉన్నాయని గణాంక ప్రాంతీయ ఉపసంచాలకుడు పి. సీతారామారావు సంతృప్తి వ్యక్తం చేశారు. రెండు నెలలకు చెందిన కార్పొరేషన్ నిధుల వ్యవహారాలపై గణాంక అధికారులు మంగళవారం ఆడిట్ నిర్వహించారు. అనంతరం కమిషనర్ పల్లి నల్లనయ్య గణాంక అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గణాంక ప్రాంతీయ ఉపసంచాలకుడు పి. సీతారామారావు మాట్లాడుతూ.. పన్నుల వసూళ్లలో విజయనగరం కార్పొరేషన్ గణనీయమైన వృద్ధిని సాధించడం సంతోషదాయకమన్నారు. శతశాతం పన్నులను రాబట్టేందుకు అవసరమైన సూచనలను చేశామన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ కె. అప్పలరాజు, జిల్లా గణాంక అధికారి బి.అరుణకుమారి, సహాయ గణాంక అధికారి సీహెచ్ ప్రభావతి, సీనియర్ ఆడిటర్ సీహెచ్ వెంకటసతీష్, ఎం.కిశోర్, టి. రమేష్ బాబు, కె. వెంకటరత్నం, జూనియర్ ఆడిటర్ ఎంవీ అప్పారావు, ఏఓ సీతారామమూర్తి, రోజా వెంకటలక్ష్మి, నర్సింగరాజు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

విజయనగరం టౌన్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని భారత మానవ హక్కుల సంరక్షణ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు గార సత్యనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్‌లో సంస్థ జాతీయ అధ్యక్షుడు ఆర్.ప్రసాదరావు చేతుల మీదుగా రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజికంగా, వ్యక్తిగతంగా ఇబ్బందులు పడేవారి తరపున అవిశ్రాంతంగా పోరాటం చేసి వారి హక్కులను కాపాడతామని చెప్పారు. బాధితులు లిఖితపూర్వకంగా సమస్యను తమ దృష్టికి తీసుకువస్తే వారికి అండగా నిలబడతామన్నారు. సంస్థ జాతీయ అధ్యక్షుడు ఆర్.ప్రసాదరావు మాట్లాడుతూ.. మానవ హక్కుల సంరక్షణలో ఎనలేని కృషిని సాధించి సంస్థ అభ్యున్నతికి సభ్యులందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సత్తి అచ్చిరెడ్డి, మహిళా నాయకులు, సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం

పూసపాటిరేగ: నవ ధాన్యాల సాగుతో భూసారం పెరిగి అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం డీపీఎం ఆనందరావు, ఏఓ కె. నీలిమ అన్నారు. మండలంలోని గోవిందపురం గ్రామంలో ప్రకృతివ్యవసాయం సిబ్బంది ఆధ్వర్యంలో రైతులకు నవధాన్యాల కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాన పంటకు ముందు నవధాన్యాలు సాగు చేయడం వల్ల భూమికి కావాల్సిన కార్బన్ అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది కమల, అశ్విని, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఓటరు జాబితా తయారీకి సహకరించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ సుదర్శనరావు

నెల్లిమర్ల: ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పుల ద్వారా మెరుగైన ఓటరు జాబితా తయారీకి సహకరించాలని రాజకీయ పార్టీల నాయకులకు తహసీల్దార్, సహాయ ఈఆర్వో సుదర్శనరావు కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. అవసరమైతే పోలింగ్ కేంద్రాల మార్పు, కొత్త కేంద్రాల ఏర్పాటు కోసం అన్ని పార్టీల నాయకులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా చేర్పించాలన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు మైపాడ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి చందక గోవిందరావు, జనసేన నాయకులు కరుమజ్జి గోవిందరావు, పతివాడ అచ్చింనాయుడు, సీపీఎం నాయకుడు కిల్లంపల్లి రామారావు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు..



సత్యసాయిబాబా మాతృమూర్తి అయిన ఈశ్వరమ్మ వర్ధంతి సందర్భంగా మండలంలోని డెంకాడ, పినతాడివాడ గ్రామాల్లో సత్యసాయి భక్తులు మంగళవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. డెంకాడ గ్రామంలో ఉన్న సత్యసాయి మందిరం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. అలాగే పేదలకు చెప్పులు, గొడుగులు అందజేశారు. పినతాడివాడ జంక్షన్ వద్ద సత్యసాయి భక్తులు పులిహోరా పంపిణీ చేశారు. – డెంకాడ

వాసవీమాత జయంతి వేడుకలు ప్రారంభం



ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్ నారాయణం శ్రీనివాస్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆరవెల్లి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో అమ్మవారికి 108 మంది దంపతులతో అష్టోత్తర కలశ పూజలు చేశారు. బుధవారం అమ్మవారికి బంగారు చీర, వజ్ర కిరీటం అలంకరించనున్నారు. అలాగే ఆర్యవైశ్య సభ్యులు 102 రకాల పిండి వంటలతో సారె సమర్పిస్తారని నిర్వాహకులు తెలిపారు. – విజయనగరం టౌన్

అభినందనలు



ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) జిల్లా కో ఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సాయిరామ్‌ను ఆరోగ్యశ్రీ సిబ్బంది మంగళవారం కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..లబ్ధిదారులందరికీ మెరుగైన ఆరోగ్యశ్రీ సేవలు అందేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ దూబ రాంబాబు, టీమ్ లీడర్లు తుంపల్లి జనార్దనరావు, భానుప్రసాద్, ఆర్.ముత్యాలనాయుడు, దేవి, తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం ఫోర్ట్

రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి

• జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం ఆనందరావు



రైతులకు విత్తనాలు అందిస్తున్న డీపీఎం ఆనందరావు, తదితరులు

భోగాపురం: రైతులు వీలైనంత వరకు రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం ఆనందరావు సూచించారు. ఈ మేరకు మండల కేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేంద్రియ విధానంలో పంటలు పండించడం వల్ల నేల తల్లి ఆరోగ్యవంతంగా ఉంటుందని, ప్రజల ఆరోగ్యం కూడా బాగుంటుందని చెప్పారు. అధిక మోతాదులో రసాయన ఎరువులు వాడడం వల్ల ఎన్నో అనర్థాలు చోటుచేసుకుంటాయన్నారు. తక్కువ ఖర్చుతో సహజ ఎరువులను తయారు చేసుకోవచ్చని, సేంద్రియ ఎరువులు ఉపయోగిస్తే దిగుబడి కూడా ఆశాజనకంగా ఉంటుందని తెలిపారు. నేల సారవంతానికి తొలకరి వర్షాలు పడిన వెంటనే నవధాన్యాల విత్తనాలను చల్లుకోవాలని సూచించారు. ఏఓ హరికృష్ణ మాట్లాడుతూ.. రాయితీపై జీలుగ, కట్టిజనుము విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు



పాలాస్పత్రిని పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

విజయనగరం: నగరంలో వివిధ చోట్ల చేపట్టనున్న అభివృద్ధి పనుల నిమిత్తం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ఈమేరకు డీఈ శ్రీనివాసరావు నేతృత్వంలోని బృందం వివిధ ప్రాంతాలలో మంగళవారం పర్యటించి చేపట్టనున్న నిర్మాణ పనులు, అందుకయ్యే అంచనాలను రూపొందించారు. గాంధీ పార్క్‌లో పలు అభివృద్ధి పనులతో పాటు వెనుక భాగంలో ఉన్న గెడ్డకు ర్యాంప్ నిర్మాణం నిమిత్తం అంచనాలు రూపొందించారు. అదేవిధంగా ఏనుగులు రాయి కాలనీలో ఇళ్ల కింద భాగం నుంచి ఉన్న ప్రధాన పైప్‌లైన్‌లను తొలగించి కొత్త పైప్‌లైన్లు వేసేందుకు అవసరమైన ప్రతిపాదనలను తయారు చేశారు. అలాగే పాలాస్పత్రి గొప్పతనాన్ని తెలియజెప్పేలా మరమ్మతులు చేపట్టేందుకు అవసరమయ్యే నిధుల కోసం అంచనాలు రూపొందించారు. అలాగే నెహ్రూ చిల్డ్రన్ పార్క్ ఎదురుగా ఉన్న ప్రాంతంలో చిరు వ్యాపారస్తుల సౌకర్యార్థం వెండింగ్ స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించారు.